క్లుప్తంగా...

ఘనంగా పెరియార్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెరియర్ 144వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఎస్ఎఫ్, డీబీఎస్ఏ ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో పెరియార్ చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

ఫెలోషిప్‌ల పునరుద్ధరణకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల కేంద్రం రద్దు చేసిన మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్(ఎంఎన్ఎఫ్)ను పునరుద్ధరించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ పీహెచ్‌డీ విద్యార్థుల ఫెలోషిప్‌ల సంఖ్య పెంచాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేశవరావు, వద్దిరాజు రవీంద్రకు వామపక్ష విద్యార్థి నాయకులు వినతి పత్రం సమర్పించారు. పేద పరిశోధన విద్యార్థులకు 2005 నుంచి నేషనల్ ఫెలోషిప్‌లు అందచేస్తున్నారని బీజేపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేయడం లేదా సంఖ్యను తగ్గించడంతో పీహెచ్‌డీ పూర్తిచేయాలేక పోతున్నారని నేటి నుంచి జరిగే పార్లమెంట్ సమావేశంలో ఫెలోషిప్‌ల పునరుద్ధరణపై చర్చించాలని వినతుల్లో విజ్ఞప్తి చేశారు.

ఓయూలో నిరసన ప్రదర్శన



విద్యార్థి సంఘాల ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టాలని ఓయూలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు ఎంఎస్ఎఫ్, డీబీఎస్ఏ, పీడీఎస్‌యూ, డీఎంఎస్ఏ, బీఎస్ఎఫ్, ఆదివాసి స్టూడెంట్ ఫోరం (ఏఎస్ఎఫ్), పీహెచ్‌డీ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్లను నేటి (సోమవారం) నుంచి జరిగే సమావేశంలో ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించాలని లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఘనం.. ఓనం



కంటోన్మెంట్: ఆత్మ మలయాళీ సేవా సమితి ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని ఎం.ఎం.ఆర్ గార్డెన్స్ ఆవరణలో నిర్వహించిన ఓనం వేడుకలు ఘనంగా జరిగాయి. మలయాళీ సినీనటి తార కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలు ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న మలయాళీయులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా బలి చక్రవర్తి వేషధారణ, నృత్యాలు, ముగ్గులతో బలికి ఆహ్వానం, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ మలయాళీ సేవా సమితి అధ్యక్షుడు అజయ్ కుమార్, సెక్రెటరీ రాజేశ్, అసోసియేషన్ సభ్యులు చంద్ర మోహన్, థామస్ జాన్సన్, రాజనారాయణ, థామస్, నాయర్, రాజకమల్ పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



మట్టి విగ్రహాలను అందజేస్తున్న కార్తీకరెడ్డి

పర్యావరణ పరిరక్షణకు మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజించాలని వక్తలు పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉచితంగా మట్టి గణపతుల విగ్రహాలను అందజేశారు. –అమీర్‌పేట/సనత్‌నగర్/రాంగోపాల్‌పేట్/బౌద్ధనగర్/లాలాపేట



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న రూప



మట్టి గణపతులు అందజేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



మట్టి వినాయక విగ్రహాలు అందజేస్తున్న కృష్ణ ఆదిత్య

'విజయభేరి'కి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న నోముల ప్రకాశ్‌రావు



ర్యాలీగా వెళ్తున్న సాయిబాబా

చిలకలగూడ: సికింద్రాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు తుక్కుగూడ విజయభేరి బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు. నాగులూరి వీధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి చిలకలగూడ చౌరస్తా వరకు డప్పుచప్పుళ్లు, జై కాంగ్రెస్ నినాదాలు, మహిళల నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. విజయభేరి బహిరంగసభ విజయవంతమైందని, తెలంగాణలో కాంగ్రెస్ అఖండ విజయం సాధిస్తుందని సాయిబాబా ధీమా వ్యక్తం చేశారు.

రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో..

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే అన్ని వర్గాల అభ్యున్నతి జరుగుతుందని నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. తుక్కుగూడలో ఆదివారం జరిగిన విజయభేరి సభకు ఆయన ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట మణిమాల, రమేష్, కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

100 కార్లతో భారీ ర్యాలీ..

సికిందాబాద్: తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభకు సీనియర్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో 100 కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోని కారణంగా ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతుందని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, జగదీశ్వర్, సురేశ్‌లాల్, షకీల్‌ఖాన్, వహీదుద్దీన్, అభిషేక్ పాల్గొన్నారు.

పేదల సౌకర్యార్థం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్



ఫంక్షన్‌హాల్ పనులను ప్రారంభించిన లక్ష్మీబాల్‌రెడ్డి, సాయికిరణ్‌యాదవ్

సనత్‌నగర్: పేద, మధ్యతరగతి ప్రజల మేలు కోసమే ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మిస్తున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. కైలాష్‌నగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో రూ.3.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ఆదివారం ఇరువురు ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లకు రూ.లక్షల్లో అద్దెలు చెల్లించలేక పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని వీరి సౌకర్యార్థం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మల్టీపర్పస్ హాల్‌ను నిర్మాణానికి మంజూరు చేయించారని చెప్పారు.మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, కైలాష్‌నగర్ అధ్యక్షుడు భోగి బాలరాజ్, నాయకులు సురేష్‌గౌడ్, సరాఫ్ సంతోష్, ఖలీల్‌బేగ్, రాజేష్‌ముదిరాజ్, జమీర్, పుష్పలత, ఝాన్సీ, రుక్మిణి, పద్మ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టాటా ప్రీమియం నెక్సా కార్లు

సికింద్రాబాద్: టాటా మోటార్స్ రూపొందించిన ప్రీమియం డిజైన్, నెక్ట్స్ లెవల్ ప్రీమియం ఫీచర్స్ కార్లను ఆదివారం సికింద్రాబాద్ రైల్‌నిలయం సమీపంలోని జాస్పర్ ఇండస్ట్రీస్ టాటా షోరూంలో విడుదల చేశారు. సినీ నటుడు తిరువీర్, జాన్సన్ ఇండస్ట్రీస్ సీఈఓ సంజీవ్‌రావు ఎస్‌యూవీ మోడల్లో పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎం సాయిచరణ్, జీఎం పాషం కిరణ్, ఎంఎస్ఎం సాయి పాల్గొన్నారు.



కారును విడుదల చేస్తున్న తిరువీర్

మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



ఆంజనేయులు
ఓయూ ఇన్‌స్పెక్టర్

లాలాపేట: వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓయూ పరిధిలో ఇప్పటి వరకు 160 మంది వినాయక మండపాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు అన్ని నిర్వాహకులే పూర్తి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని రాత్రి 10 గంటల తర్వాత మండపాల వద్ద మైకొసెట్‌లను బంద్ చేయాలన్నారు. రాకపోకలకు ముఖ్యంగా అంబులెన్స్ వంటి వాటికి ఆటంకం కలగరాదన్నారు. ప్రధానంగా విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా కనెక్షన్లను పలుమార్లు సరిచేసుకోవాలని శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాంగోపాల్‌పేట్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-320ఏ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కోఆర్డినేటర్ జాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ్ హాజరై ఉపాధ్యాయులను సత్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ వృతి ఎంతో గౌరవప్రదమైనదని, దేశ ప్రగతికి వారు నిర్మాతలని కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఉపాధ్యాయులు పడుతున్న కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్‌రెడ్డి, కోటేశ్వర రావు, డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, ఎం జనార్ధన్‌రెడ్డి, ఎంవి చారి, ఈవెంట్ చైర్మన్ పఠాన్ ఉమ్మర్ ఖాన్, కో చైర్మన్ ఎంవీఎస్ రంగయ్య పాల్గొన్నారు.

నాణ్యతలేని ఆహారం, అపరిశుభ్రత కారణంగా

ఆల్ఫా హోటల్ మూసివేత



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

రాంగోపాల్‌పేట్: అపరిశుభ్ర వాతావరణంతో పాటు, నాణ్యత లేని ఆహార పదార్థాలను వినియోగదారులకు సరఫరా చేస్తుండటంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే ఆల్ఫా హోటల్‌ను అధికారులు మూసివేయించారు. ఈ హోటల్‌పై ఈ నెల 15వ తేదీన కొంత మంది ఫిర్యాదు చేయడంతో జీహెచ్ఎంసీ అధికారులు వచ్చి హోటల్‌ను పరిశీలించి కొన్ని శాంపిల్స్‌ను సేకరించారు. అదే రోజు హోటల్‌ను పరిశీలించిన అధికారులకు అపరిశుభ్ర వాతావరణంలో కిచెన్, పరిసరాలను గుర్తించారు. సేకరించిన శాంపిల్స్‌ను నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబోరేటరీకి పంపించారు. ఆదివారం మరోమారు అధికారుల బృందం హోటల్‌ను తనిఖీ చేయగా నాణ్యత లేని ఆహార పదార్థాలు, అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి హోటల్‌ను మూసివేశారు. కేసును అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

బీఆర్ఎస్ సమైక్యత.. బీజేపీ విమోచనం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న బీజేపీ నేతలు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యత దినోత్సవంగా జరుపుకోగా బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవంగా భావించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలను ఇరు పార్టీల నేతలు, నాయకులు ఎగరవేసి నినాదాలు చేశారు. –సికింద్రాబాద్, సనత్‌నగర్ కంటోన్మెంట్ జోన్ల బృందం



బోయిన్‌పల్లిలో జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు



జాతీయ జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



జాతీయ విమోచన దినోత్సవంలో బీజేపీ నేతలు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 31, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 22, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్డగుట్ట ఏ-సెక్షన్‌కు చెందిన అశోక్(40) కుటుంబ కలహాలతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు అశోక్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వృద్ధురాలి అదృశ్యం

అడ్డగుట్ట: మతిస్థిమితం సరిగాలేని ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన తిరుపతమ్మ(70)కు మతిస్థిమితం సరిగాలేదు. ఈ నెల 17న ఉదయం తన కుమారుడితో కలిసి తుకారాంగేట్ వద్ద టీ తాగేందుకు వెళ్లింది. కొడుకు టీ డబ్బులు చెల్లించి వచ్చే సరికి కనిపించకుండా పోయింది. పరిసర ప్రాంతాల్లో వెతికి, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు ఆదివారం ఫిర్యాదు చేశాడు.